క్లుప్తంగా

‘తప్పుడు ప్రచారం మానుకోవాలి’

భిక్కనూరు: మాజీ సర్పంచ్ సత్యంరెడ్డిపై తాను, తన సోదరుడు జ్ఞాన ప్రకాశ్‌రెడ్డి దాడి చేశామంటూ కొందరు ప్రచారం చేస్తూ వారిచేత తప్పుడు ఫిర్యాదు చేయడం మానుకోవాలని బీఎస్పీ కామారెడ్డి నియోజకవర్గం అధ్యక్షుడు పెద్ద బచ్చగారి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన భిక్కనూరులో మీడియాతో మాట్లాడుతూ మంగళవారం తన సోదరుడు ఇంటి ప్రహరిని కూల్చివేసుకుంటుండగా మాజీ సర్పంచ్ సత్యంరెడ్డి, ఆయన భార్య శోభాంజలి బూతులు తిట్టడంతో పాటు రాళ్లతో దాడి చేశారన్నారు. ఆసమయంలో తాను అక్కడ లేకున్నా తప్పుడు ఫిర్యాదు చేయడం సిగ్గు చేటన్నారు. బీఎస్పీ నాయకుడిగా తాను నిరుపేదలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే కొందరు జీర్ణించుకోలేక తనపై తప్పుడు ప్రచారం ఫిర్యాదులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పన్ను వసూలు వంద శాతం తప్పనిసరి



నాగిరెడ్డిపేట: ఇంటి పన్ను ఈ నెల 15వ తేదీ లోగా వందశాతం వసూలు చేయాలని మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. మండలంలోని మెల్లకుంటతండా పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ కేస్లీభాయి, పంచాయతీ కార్యదర్శిసవాయి సింగ్ ఉన్నారు.

స్వయంపాలన దినోత్సవం



నాగిరెడ్డిపేట: మండలంలోని ఆత్మకూర్ హైస్కూల్‌లో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠశాలను బోధించారు. దీంతో పాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించి పాఠశాల నిర్వాహణపై స్వీయ అనుభవాన్ని పొందారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్ఎం సౌజన్య బహుమతులను ప్రదానం చేశారు.

కూలీలకు ఉపాధి పనులు



నాగిరెడ్డిపేట: కూలీలకు అవసరమైన ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో రఘు సూచించారు. మండలంలోని నాగిరెడ్డిపేట, అక్కంపల్లి, తాండూర్ గ్రామాలలో చేపట్టిన ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కూలీలతో ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం బంజరలోని నర్సరీలో మొక్కలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతి కార్యదర్శులు బాల్‌రాజ్, మమత, ఏఫ్ఏలు సత్యనారాయణ, శ్రీనివాస్ ఉన్నారు.

ఒకరి హక్కులు మరొకరు హరించొద్దు



ఎల్లారెడ్డిరూరల్: ప్రతి పౌరుడికి సమాన హక్కులు ఉన్నాయని తిమ్మారెడ్డి సర్పంచ్ మహ్మద్ అబ్దుల్ అలీ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలో బుధవారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ శారద మాట్లాడుతూ ఒకరి హక్కులను మరొకరు హరించరాదని అన్నారు. కార్యక్రమంలో గిర్దావార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్ విరాళం



లింగంపేట: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బోరు మోటారును ఎంపీపీ గరీబున్నీసా బేగం బుధవారం ప్రారంభించారు. వాటి కయ్యే ఖర్చును హైకోర్టు న్యాయవాది మోహిన్ హమ్మద్ ఖాద్రీ విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కోసం వినతి
- టీచర్లతో సమానంగా వేతనాలివ్వాలి
- జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడి టీచర్ల ధర్నా



ఎల్లారెడ్డి ఐసీడీఎస్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడి టీచర్లు

సాక్షి, నెట్‌వర్క్: ప్రభుత్వ టీచర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడి టీచర్లు బుధవారం జిల్లా వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, గాందారి మండలాల అంగన్‌వాడి టీచర్లు ఎల్లారెడ్డి సీడీపీవో పద్మను కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, మాచారెడ్డి, రాజంపేట మండలాలకు చెందిన అంగన్‌వాడి టీచర్లు దోమకొండ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. టీఏ, డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాబాయ్, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు యాదమ్మ, సెక్టార్ యూనియన్ ప్రతినిధులు లక్ష్మి, రాణి, విజయలక్ష్మి, సంతోష, విజయ పాల్గొన్నారు. మద్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడి టీచర్లు సమస్యలు పరిష్కరించాలని సీడీపీవో సునందకు వినతి పత్రం అందించారు.



దోమకొండలో సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు



మద్నూర్‌లో సీడీపీవోకు వినతి పత్రం ఇస్తూ..

బీర్కూర్ మండలం తెలంగాణ తిరుమల దేవస్థానలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సీఎం కేసీఆర్ హాజరవుతున్న దృష్ట్యా మండలంలోని అంగన్‌వాడి టీచర్లు గౌతమి, గంగామణి తదితరులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

జిల్లా ఆస్పత్రిని బాన్సువాడకు తరలించొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు



దోమకొండలో ధర్నా చేస్తున్న బీవీఎం నాయకులు



మాచారెడ్డిలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

భిక్కనూరు: కామారెడ్డిలో ఉన్న జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వం బాన్సువాడకు తరలించేందుకు చర్యలు తీసుకోవడం తగదని డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక కామారెడ్డి పట్టణం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. కామారెడ్డికి మెడికల్ కళాశాలను ఒక చెత్తో ఇచ్చి ఇంకో చేత్తో జిల్లా ఆసుపత్రిని తరలించాలని చూడటం సరికాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో విద్యార్థి నేతలు జీవన్ మౌనిక, పావని, రాజు తేజ, శంబు, సాయి, శివలు పాల్గొన్నారు.

దోమకొండ: జిల్లా కేంద్రంలో ఉన్న ఆస్పత్రిని బాన్సువాడకు తరలించకుండా దోమకొండలో ఏర్పాటు చేయాలని భారతీయ విద్యార్థి యువమోర్చా ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. విద్యార్థి యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విఠల్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన దోమకొండలో జిల్లా ఆస్పత్రిని ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, ఉపాధ్యక్షుడు బాను తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని తరలించే ప్రయత్నాన్ని మానుకోవాలని పీడీఎస్‌యూ మండల ఉపాధ్యక్షుడు సరిచంద్ డిమాండ్ చేశారు. బుధవారం మాచారెడ్డిలో విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. కామారెడ్డి నగరం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఆస్పత్రిని తరలించడం సరికాదని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి



సమావేశంలో ఎంపీపీ జ్యోతి, అధికారులు

నిజాంసాగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు,సర్పంచులు దృష్టి సారించాలని ఎంపీపీ జ్యోతి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికి సక్రమంగా అందేలా చూడాలన్నారు. అచ్చంపేట సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ కోతల వల్ల వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు సర్పంచులు పేర్కొన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్‌కు సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మనోహర్, అచ్చంపేట, మల్లూర్ సొసైటీ చైర్మన్లు నర్సింహారెడ్డి, ఒంటరి కళ్యాణి, ఎంపీడీవో నాగేశ్వర్, సర్పంచుల పోరం మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట జెడ్పీ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ వెంకటరమణ తెలిపారు. వివిధ కారణాలతో గత ఏడాది జూలైలో నిలిచిపోయిన ఈ పథకాన్ని తిరిగి ప్రారంభించారు.

సభా ప్రాంగణం జాగిలాలతో తనిఖీ

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుమల దేవస్థానానికి బుధవారం సీఎం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం చుట్టూ ఉన్న ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ జాగిలాలతో పోలీసులు తనిఖీ నిర్వహించారు.

నేడు సౌత్ క్యాంపస్‌లో సైన్స్ డే

భిక్కనూరు: తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్‌లోని ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో గురువారం సైన్స్ డే, జాతీయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు భౌతికశాస్త్ర హెచ్‌వోడీ డాక్టర్ ఎల్. హరిత, ఏపీఆర్‌వో డాక్టర్ యాలాద్రి బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రవీందర్‌గుప్తా హాజరవుతారని పేర్కొన్నారు.

మహమ్మద్‌నగర్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలి



సీఎం కేసీఆర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ వినతి పత్రం అందజేశారు. తెలంగాణ తిరుమల వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆమె సీఎంను కలిశారు. సింగితం, గున్కుల్ వాగులపై బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

సంగారెడ్డి జిల్లా తడ్కల్‌ను కూడా..

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుమల దేవ స్థానానికి సీఎం కేసీఆర్ వచ్చిన సందర్భంగా సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం తడ్కల్ గ్రామ సర్పంచ్ గడ్డం మనోహర్ సీఎంను కలిసి తడ్కల్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలని వినతిపత్రం ఇచ్చారు. అంతకుముందు వినతిపత్రాన్ని శ్రీవారి పాదాల వద్ద ఉంచారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆందోల్ సభలో తడ్కల్ గ్రామాన్ని మండల కేంద్రంగా చేస్తానన్న హామీని సీఎం నిలబెట్టుకోవాలని శ్రీవారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్ట్



మద్నూర్ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు



బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

మద్నూర్: సీఎం కేసీఆర్ పర్యటన దృష్ట్యా బీజేపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలోని తిమ్మానగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సీఎం హాజరైన విషయం తెలిసిందే. బీజేపీ మండల అధ్యక్షుడు హన్మండ్లు, నాయకులు తుకారం, హన్మండ్లు, నరేష్, తుకారం అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. సీఎం కేసీఆర్ పర్యటన ముగిసిన అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్, సీపీఎం నాయకులు..

బాన్సువాడ టౌన్: సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బాన్సువాడను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని తాము డిమాండ్ చేశామని తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్, నాయకులు ఖలేష్, మంత్రి గణేష్, సాయిలు, గుడాల నగేష్, సాయిలు, రఫీ, గంగాధర్, జమల్, షోహెబ్, వెంకన్న, సలీం, సీపీఎం నాయకులు రవీందర్, ఖలీల్, బీజేవైఎం నాయకులు సాయికిరణ్, అశ్విన్, సాయి తదితరులను అరెస్టు చేశారు.

రెడ్డి సంక్షేమ కార్యవర్గం ఎన్నిక



మోటాట్‌పల్లి రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం

భిక్కనూరు: మండలంలోని మోటాట్‌పల్లి గ్రామంలో రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురెడ్డి వినయ్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యాక్షుడిగా బుర్ర శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మోటాటి భూంరెడ్డి, కోశాధికారిగా మంగగారి చంద్రరెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికలను సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు నాగన్నగారి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

బహుళ అంతస్తుల నిర్మాణం నిలిపివేత

దోమకొండ: మండల కేంద్రంలోని శివరాం మందిర్ ఏరియాలో నిర్మిస్తున్న మడిగెలు బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టకూడదని బుధవారం జరిగిన ఆలయ కమిటీ సమావేశంలో తీర్మానించారు. 2018లో వేలం పాట ద్వారా నిర్మిస్తున్న మడిగెలు ఒక అంతస్తు వరకు మాత్రమే చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ అబ్రబోయిన రాజు, ప్రజాప్రతినిధులు నల్లపు శ్రీను, నర్సారెడ్డి, ఐరేని నర్సయ్య, కానుగంటి నాగరాజు, కడారి రమేష్, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు రాజిరెడ్డి, సిద్దరెడ్డి, భూపాల్‌రెడ్డి, కదిరె మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పున్న రాములు, లక్ష్మన్, నాగారపు ఎల్లయ్య, చెన్నం రవి పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదల జీవితాల్లో వెలుగు



పిట్లం: కంటి వెలుగు కార్యక్రమం నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపుతోందని సర్పంచ్ గడిల మైపాల్ పేర్కొన్నారు. ఆయన మండలంలోని కుర్తి గ్రామంలో బుధవారం కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



నర్సన్నపల్లిలో పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ



చిన్నకొడప్‌గల్‌లో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి..

కామారెడ్డి అర్బన్: మండలంలోని నర్సన్నపల్లి గ్రామంలో బుధవారం ఎంపీపీ పిప్పిరి అంజనేయులు, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, జెడ్పీటీసీ సభ్యురాలు చిదుర రమాదేవి సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. సర్పంచ్ ద్యాప హన్మాండ్లు, పీఏసీఎస్ డైరెక్టర్ రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నిమ్మ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నకొడప్‌గల్‌లో..

పిట్లం: మండలంలోని చిన్నకొడప్‌గల్ బీసీ కాలనీలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బుధవారం సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్‌రామిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విజయ్, నారాయణ, ఉప సర్పంచ్ శశికాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెరిగేలా కృషి



లింగంపేట: విద్యార్థుల్లో నైపుణ్యం పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అన్నారు. బుధవారం మోతె ఉన్నత పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్సు ప్రయోగాలను ప్రదర్శించారు. విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని చదవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయురాలు కీర్తిమాలిని, ఉపాధ్యాయులు అంజయ్య, దత్తుబాయి, మమత, హస్సేన్, ఇలియాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

రేపటి నుంచి బీరప్ప కామరాతి ఉత్సవాలు



బీబీపేట: మండల కేంద్రంలోని శ్రీ కామరాతి, బీరప్ప ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పర్శరాంలు తెలిపారు. ఈ సందర్భంగా పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు వెల్లడించారు. శనివారం మైలబోనం, గద్దె బోనం, మైల లింగాలు పట్టుట, ఆదివారం ఊళ్లే సరుగు, లగ్నం బోనాలు, సోమవారం లింగాలు పట్టుట, శ్రీ కామరాతి బీరప్ప కల్యాణ మహోత్సవం, గావు పట్టుట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ముగిసిన గీతామందిర వార్షిక బ్రహ్మోత్సవాలు



కామారెడ్డి అర్బన్: శ్రీకృష్ణ గీతా మందిరం 21వ వార్షికోత్సవ బ్రహ్మోత్సాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జ్ఞాన నంద చైతన్యానందస్వామి గీతా మందిరం నూతన ముఖ ద్వారాన్ని ప్రారంభించారు. అనంతరం చైతన్యానంద స్వామిని సన్మానించారు. కార్యక్రమంలో గీతా మందిరం ప్రతినిధులు టంకరి రాజయ్య, పాత వెంకటేశం, పాత అశోక్, అర్వపల్లి రమేష్, దోమకొండ కృష్ణమూర్తి, మాద్యం సుదర్శన్, ఎంకే వంజరి సిద్దిరాములు పాల్గొన్నారు.

భక్తులకు ఇక్కట్లు

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్‌లో ఉన్న తెలంగాణ తిరుమల దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన శ్రీవారి కల్యాణానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. సీఎం కేసీఆర్ రావడంతో కొంతమంది భక్తులకు మాత్రమే పాసులు జారీ చేశారు. ఈ విషయం తెలియక భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పాసులు లేనివారిని పోలీసులు అనుమతించలేదు. దీంతో భక్తులు సీఎం కేసీఆర్ ఆలయం నుంచి వెళ్లే వరకు నాలుగు గంటల పాటు అక్కడే ఎండలో వేచి ఉన్నారు.

ఘనంగా గంగ తెప్పోత్సవం

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గంగమ్మ ఉత్సవాల్లో భాగంగా గంగ తెప్పోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ప్రజల కోసమే ఆర్టీసీ సేవలు



ఆర్టీసీ సేవల గురించి వివరిస్తున్న డీఎం స్వామి

రుద్రూర్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ టీఎస్ స్వామి కోరారు. పోతంగల్ మండలం దోమలేడ్గి, కొల్లూర్, సుంకిని గ్రామాల్లో బుధవారం బోధన్ డిపో ఆధ్వర్యంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ ప్రజా ప్రయోజనం కోసమే బస్సులను నడుపుతోందని అన్నారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులకు బస్ పాస్ రాయితీలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. 24 గంటలు కార్గో సేవలు అందించడంతో పాటు, డిపాజిట్ లేకుండా శుభకార్యాలకు బస్సులను అద్దెకు ఇస్తున్నామని వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన




రుద్రూర్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వర్ని ఎస్సై అనిల్ రెడ్డి సూచించారు. రుద్రూర్ మండలం అంబం(ఆర్) శివారులోని మోడల్ స్కూల్‌లో బుధవారం వర్ని పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్‌లో ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు చెప్పే మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆలూరి నరేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బోధన్‌టౌన్: సమాజంలో నిత్యం జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ ప్రేమ్ కుమార్ అన్నారు. పట్టణంలోని విస్డమ్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో భాగంగా సైబర్ జాగృత దివస్‌ను నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల గురించి వారి తల్లిదండ్రులకు వివరించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తీవ్ర కసరత్తు జరుగుతుందని అన్నారు.

పెరిగిన కరువు భత్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నేత మల్లేశ్

రుద్రూర్: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ డిమాండ్ చేశారు. చందూర్ మండల కేంద్రంలో బుధవారం బీడీ కార్మికులతో కలిసి మాట్లాడారు. బీడీ కార్మికులందరిని యూనియన్ సంఘటిత పరిచి పోరాడిన ఫలితంగానే 1994లో కరువు భత్యం సాధించుకున్నామని పేర్కొన్నారు. పెరిగిన కరువు భత్యాన్ని ఏప్రిల్ నుంచి అమలు చేయాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.